క్లుప్తంగా

దుర్గాదేవి స్తుతి లోకానికి రక్ష



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): అఖిల లోకానికి శక్తిని అనుగ్రహించే దుర్గాదేవి స్తుతి లోకానికి రక్షగా నిలుస్తుందని ఇచ్ఛాపురం నైమిశారణ్య పీఠాధిపతి బాలబ్రహ్మానంద సరస్వతి స్వామి ప్రవచించారు. శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రికి ధర్మ ప్రచారంలో భాగంగా అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కథావేదికపై బుధవారం ఆధ్యాత్మిక ప్రవచనం సాగింది. నైమిశారణ్య పీఠాధిపతి బాల బ్రహ్మానంద సరస్వతి స్వామిజీ అమ్మవారి శక్తి, అమ్మవారి రూపాల విశిష్టతను వివరించారు. అమ్మవారి చల్లటి చూపుతో సకల శుభాలు కలుగుతాయని, సకల కార్యాల యందు విజయాన్ని ప్రసాదించే తల్లిగా దుర్గాదేవి ప్రసిద్ధి చెందారన్నారు. వేయి కన్నులతో ఉన్న దేవి శాతాక్షిగా పూజలందుకుంటూ సర్వ లోకాల ఆకలిని తీర్చే శాకంబరీదేవిగా ప్రత్యక్షమే భక్తులను నిరంతరం కాపాడుతూ ఉంటారన్నారు. అనంతరం స్వామిజికి దేవస్థాన ఈవో కెఎస్.రామారావు, అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందచేశారు.

దుకాణాల్లో చోరీలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు దుకాణాల్లో బుధవారం చోరీలు జరిగాయి. సేకరించిన వివరాల ప్రకారం... ఫ్రైజర్‌పేటలో చర్చి సమీపంలోని ఓ ఫ్యాన్సీ షాపునకు వేసిన తాళాలను గుర్తు తెలియని వ్యక్తులు విరగొట్టి లోపల క్యాష్ కౌంటర్‌లో ఉన్న రూ. 10 వేల నగదును చోరీ చేశారు. మరో వైపు భీమన వారి పేట ఉప్పు వెంకట నారాయణ వీధిలో జ్యూస్‌షాపు తాళాలు పగలగొట్టి చోరీకి యత్నం చేశారు. అయితే కౌంటర్‌లో నగదు లేకపోవడంతో సామగ్రిని చిందర వందర చేసి వదిలేశారు.

చెస్ టోర్నమెంట్‌లో రిత్విక్ ప్రతిభ



భవానీపురం(విజయవాడపశ్చిమ): స్టేట్ ఓపెన్ చెస్ టోర్నమెంట్‌లో గొల్లపూడి అట్కిన్‌సన్ స్కూల్ విద్యార్థి గద్దె రిత్విక్ ప్రతిభ కనబరిచి ట్రోఫీ గెలుచుకున్నాడు. విజయవాడ గుణదల సెయింట్ జాన్స్ స్కూల్‌లో స్పార్క్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 23వ తేదీన నిర్వహించిన ఈ టోర్నమెంట్‌లో అండర్–9 కేటగిరిలో తృతీయ స్థానంలో నిలిచాడు. మొత్తం 7 రౌండ్లకిగాను 5 పాయింట్స్ సాధించటంతోపాటు ట్రోఫీ, సర్టిఫికెట్ అందుకున్నాడు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ సిస్టర్ ఫాతిమ పావని చెస్ టోర్నీ విజేత గద్దె రిత్విక్, కోచ్ ఎ.రామకృష్ణను అభినందించారు. మెదడుకు మేత పెట్టే చెస్ క్రీడలో రాష్ట్ర స్థాయిలో మూడవ స్థానంలో నిలబడటం స్కూల్‌కు గర్వకారణమన్నారు. చదువుతోపాటు క్రీడల్లోనూ రాణిస్తేనే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని పేర్కొన్నారు. రిత్విక్ భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువతి కనిపించడం లేదంటూ తల్లి కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదయింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జక్కంపూడి కాలనీ బ్లాక్ నెం 92కు చెందిన చంద్రగిరి మేరీ, రామారావు భార్యాభర్తలు. వీరికి ఇద్దరు సంతానం. కుమార్తె కృపావతి ఇంటి వద్దే ఉంటుంది. మంగళవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువతి కనిపించకపోవడంతో కేసు నమోదు చేశారు.

నేటి నుంచి సైన్స్ అండ్ ఆర్ట్ ఫెస్టివల్

భవానీపురం(విజయవాడపశ్చిమ): చిట్టినగర్ లోగల సాయి అరుణా హైస్కూల్‌లో గురువారం నుంచి శనివారం వరకు సైన్స్ అండ్ ఆర్ట్స్ ఫెస్టివల్ నిర్వహించనున్నట్లు హైస్కూల్ కరస్పాండెంట్ గుజ్జారి అరుణ కుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు తిరిగి 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఈ ఎగ్జిబిషన్ ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షులు పి.వి జయబాబు, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి హాజరవుతారని పేర్కొన్నారు. శనివారం ఉదయం 9.30 గంటలకు చిట్టినగర్ సెంటర్‌లోని శ్రీనగరాల సీతారామస్వామి శ్రీమహాలక్ష్మి అమ్మవార్ల దేవస్థాన కల్యాణ మండపంలో జరిగే బహుమతి ప్రదానోత్సవ సభకు ముఖ్యఅతిథిగా జస్టిస్ జి.శ్యామ్ ప్రసాద్ హాజరవుతారని తెలిపారు.

ప్రతిభను ప్రోత్సహించేందుకే 'ఆడుదాం ఆంధ్రా'



క్రీడాకారులతో కాటంనేని పూర్ణ, కాటంనేని కల్యాణి, చిత్రంలో ఈఓ స్వరూపరాణి



ఇంటింటికీ వెళ్లి 'వై ఏపీ నీడ్స్ జగన్' కరపత్రాలను అందించి వివరిస్తున్న పార్టీ నాయకులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): స్థానిక 47వ డివిజన్ 147వ సచివాలయం పరిధిలో గురువారం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం జరిగింది. డివిజన్‌లోని వైఎస్సార్ సీపీ నాయకులు ఇలిపిళ్ల విజయలక్ష్మి, మద్దిరాల కమలాకర్, వలంటీర్లు మహేశ్వరి, ఉదయశ్రీ, శ్రీరాములు ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు పాలనలోని టీడీపీ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పారదర్శక పాలనకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని వివరించారు. అర్హతే ప్రామాణికంగా తీసుకుని ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు కావాలా..జన్మభూమి కమిటీల పేరుతో అందినకాడికి దోచుకునే దళారులు కావాలో ఆలోచించుకోవాలని కోరారు. సంక్షేమ పథకాలతోపాటు వైద్య సేవలను ఇంటి ముంగిటకే తీసుకొచ్చిన సీఎం జగన్ నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కోసం మళ్లీ జగనన్ననే ముఖ్యమంత్రిని చేయాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందని అన్నారు. ఒక్క జగన్‌మోహన్‌రెడ్డిని ఎదుర్కొనేందుకు ప్రతిపక్షాలు మూకుమ్మడిగా ఆయనమీద, ప్రభుత్వంపైనా బురద చల్లటమే పనిగా పెట్టుకున్నారంటే జగనన్న బలం ఏమిటో అర్థం అవుతుందన్నారు.

క్రీడాకారులకు ప్రోత్సాహం....

క్రీడాకారుల్లో ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పండుగను ప్రారంభించారని విజయవాడ రూరల్ మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కాటంనేని పూర్ణ తెలిపారు. గొల్లపూడిలోని ఎస్‌పీఎస్ఆర్‌సీ హైస్కూల్‌లో బుధవారం నిర్వహించిన ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను రాయనపాడు గ్రామ సర్పంచ్ కాటంనేని కల్యాణి ప్రారంభించారు. రాయనపాడు గ్రామం నుంచి వాలీబాల్ పోటీకి రెండు టీమ్‌లు, అలాగే కబడ్డీ పోటీకి రెండు టీమ్‌లు పాల్గొన్నాయి. అదే విధంగా పైడూరుపాడు గ్రామం నుంచి రెండు క్రీడలకు రెండు టీములు పాల్గొన్నాయి.ఈ సందర్భంగా కాటంనేని పూర్ణ మాట్లాడుతూ ఔత్సాహిక క్రీడాకారులు తమ ప్రతిభను చాటిచెప్పేందుకు ఆడుదాం ఆంధ్రా గొప్ప వేదిక అన్నారు. క్రీడల ద్వారా ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవరుచుకోవచ్చని పేర్కొన్నారు. సర్పంచ్ కాటంనేని కల్యాణి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో క్రీడలకు అత్యధిక ప్రాధానం ఇస్తోందని అన్నారు. 45 రోజులపాటు జరిగే ఈ క్రీడా పోటీలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పైడూరుపాడు సర్పంచ్ రంగినేని సీతారామయ్య, గొల్లపూడి పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ స్వరూపరాణి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌లలో అన్ని వసతులు

కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్



రాజకీయపార్టీల ప్రతినిధులు, ఎన్నికల అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్

పటమట(విజయవాడతూర్పు): పోలింగ్ బూత్‌లలో అన్ని వసతులు కల్పిస్తున్నామని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్లో రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల అధికారులు, బూత్‌లెవల్ అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఎంసీ ఆధ్వర్యంలో ఇప్పటికే పలు ప్రాంతాల్లో ఓటు వేసే క్రమంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ పై (ఈవీఎం)లపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా ఓటర్ నమోదు ప్రక్రియను జనవరి 17, 2024 వరకు పొడిగించిందన్నారు. ఆఖరి జాబితా పబ్లికేషన్ జనవరి 22, 2024 వరకు ఉన్నందున కొత్తగా ఓటు నమోదు చేసుకునేందుకు మరొక అవకాశం ఉందని వెల్లడించారు. బీఎల్‌వోలు ఓటరు నమోదుపై మరోమారు దృష్టి సారించాలని కోరారు. కొత్త ఓట్లు నమోదు చేసిన తర్వాత ఒక పోలింగ్ బూత్ లో 1450 కంటే ఎక్కువ ఓట్లు ఉన్నట్లయితే అదే పోలింగ్ కేంద్రంలో ఇంకొక పోలింగ్ బూత్ ఏర్పాటుకు రూమ్‌లో వసతులు ఉన్నవీ లేనిదీ ముందుగానే పరిశీలించుకోవాలని సంబంధిత అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి (ఏఈఆర్‌వో) ఆదేశించారు. వై.సుందర్ పాల్ (వైఎస్సార్ సీపీ), ఎన్.సాంబశివరావు (టీడీపీ), సిటీ ప్లానర్ ప్రసాద్, జోనల్ కమిషనర్–2 మల్యాద్రి, సెంట్రల్ తహసీల్దార్ వెన్నెల శ్రీను, నార్త్ తహసీల్దార్ ఎం.మాధురి, ఎస్ఈ (ప్రాజెక్ట్స్) కె.రామ్మోహనరావు, వీఎంసీ ఎలక్షన్ డెప్యూటీ తహసీల్దార్ సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆరుద్రోత్సవం



ఉత్తర ద్వారంలో దర్శనమిస్తున్న మల్లేశ్వరుడు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం (పాతశివాలయం)లో ఆరుద్రోత్సవం బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. మార్గశిరమాసంలో ఆరుద్ర నక్షత్రాన్ని విశేషంగా చెబుతారు. అందులో భాగంగా పాతశివాలయంలో మంగళవారం రాత్రి నుంచి బుధవారం రాత్రి వరకూ విశేష కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలో కొలువై ఉన్న స్వామి వారికి మంగళవారం అర్ధరాత్రి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం చేశారు. అమ్మవారికి విశేష అర్చనలు నిర్వహించారు. తెల్లవారుజామున స్వామి వారి ఉత్సవమూర్తులకు ఉత్తర ద్వారంలో భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు స్వామి వారిని దర్శించుకున్నారు. కార్పొరేటర్ మరుపిళ్ల రాజేష్ తదితరులు స్వామి వారిని దర్శించుకున్నారు. ప్రధాన అర్చకులు రాచకొండ సుమంతశర్మ వైదిక కార్యక్రమాలు పర్యవేక్షించారు.

సాంస్కృతిక రంగ అభివృద్ధికి కృషి



గాయని షబానాను సత్కరిస్తున్న నిర్వాహకులు

విజయవాడ కల్చరల్: సాంస్కృతిక రంగ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు అన్నారు. తెలుగు కళావాహిని, శ్రీ కళాభారతి, జీఆర్‌కే పోలవరపు కోటేశ్వరరావు సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో సాంస్కృతిక ప్రతినిధుల ఆత్మీయ సమావేశం, సినీ సంగీత విభావరి సౌత్ సెంట్రల్ రైల్వే సాంస్కృతిక పోటీల్లో గెలుపొందిన షబానాకు ఆత్మీయ సత్కర కార్యక్రమం బుధవారం నిర్వహించారు. చిట్టిబాబు మాట్లాడుతూ కళాకారులను గుర్తించి ప్రోత్సహించాల్సిన అవసరముందని తెలిపారు. గాయని మల్లాది స్వాతి మాట్లాడుతూ కళాకారులు సాంస్కృతిక రాయబారులని చెప్పారు. సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు గోళ్ళ నారాయణరావు, శింగంశెట్టి చంద్రశేఖర్, బీవీ వీరభద్రరావు ప్రసంగించారు. నిర్వాహకులు షబానాను ఆత్మీయంగా సత్కరించారు. శ్యాంప్రసాద్, దుర్గానాగమణి, డేవిడ్‌రాజు, శ్రావణి చిత్ర గీతాలను ఆలపించారు.

సామాజిక బాధ్యతగా సమాజ సేవ

రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు మల్లాది విష్ణు



ఇంటి పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు, కార్పొరేటర్ కుక్కల అనిత

మధురానగర్(విజయవాడసెంట్రల్): తోచినంతలో సేవ చేయటం అలవాటుగా చేసుకోవాలని, సమాజ సేవను ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకుని పనిచేయాలని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు పిలుపునిచ్చారు. గడప గడపకు మన ప్రభుత్వం పర్యటన సమయంలో పలువురు పేదలు తమ కుటుంబ పోషణ నిమిత్తం దారి చూపాలని ఎమ్మెల్యేకు విన్నవించుకున్నారు. దీనిపై స్పందించిన ఆయన బుధవారం ఆంధ్రప్రభ కాలనీలోని జనహిత సదనంలో 16 మంది వీధి వ్యాపారులకు మల్లాది వేంకట సుబ్బారావు, సుందరమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన తోపుడు బండ్లను కార్పొరేటర్‌లతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల అవసరాలను, సమస్యలను గుర్తించి మానవతా దృక్పథంతో ఆదుకోవాలని.. అప్పుడే సమాజాభివృద్ధి సాధ్యపడుతుందని చెప్పారు. ఈ విషయంలో మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి చెప్పిన మాటలు తనకు మార్గదర్శకమని తెలిపారు. ఆయన స్ఫూర్తితో 2013లో మల్లాది వేంకట సుబ్బారావు సుందరమ్మ చారిటబుల్ ట్రస్ట్ ప్రారంభించి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ట్రస్ట్ ద్వారా నిరుపేద కుటుంబాలకు జీవనోపాధి కల్పించేందుకు తన వంతు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. రానున్న రోజుల్లో సేవలను మరింత విస్తృతం చేస్తామని తెలియజేశారు. గిరిపురానికి చెందిన 14 కుటుంబాలకు గతంలో ఆమోదింపబడిన రెగ్యులరైజ్డ్ పట్టాలను ఎమ్మెల్యే మల్లాది విష్ణు కార్పొరేటర్ కుక్కల అనితతో కలిసి అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ (సెంట్రల్) శ్రీనివాస్ వెన్నెల, కార్పొరేటర్లు ఉద్దంటి సునీత, కుక్కల అనిత, శర్వాణి మూర్తి, ఉమ్మడి రమాదేవి, నాయకులు యరగొర్ల శ్రీరాములు, మోదుగుల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

కవులు ప్రపంచ శాంతిలో భాగస్వాములు కావాలి



మాట్లాడుతున్న డాక్టర్ బాలకృష్ణ కుర్వే, వేదిక మీద సూరేపల్లి రవికుమార్ కలిమిశ్రీ తదితరులు

విజయవాడ కల్చరల్: కవులు, రచయితలు ప్రపంచ శాంతిలో భాగస్వాములు కావాలని నోబుల్ పీస్ ప్రైజ్ సెలక్షన్ కమిటీ సభ్యులు డాక్టర్ బాలకృష్ణ కుర్వే అన్నారు. నవభారత నిర్మాణ సంఘం, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఫర్ పీస్ డిటెర్మెంట్ అండ్ ఎన్విరాల్‌మెంట్ ప్రొటెక్షన్, గాంధీదేశం సోషల్‌వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం రైటర్స్ మీట్, కవి సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ కుర్వే మాట్లాడుతూ నేడు ప్రపంచం మొత్తం ఉగ్రవాదం పట్టి పీడిస్తోందని తెలిపారు. మానవాళిని కాపాడాల్సిన బాధ్యత కవులు మీద ఉందన్నారు. ప్రజలను చైతన్య పరిచే రచనలు రావాలని అందుకోసం కవులు కృషి చేయాలన్నారు. నవభారత నిర్మాణ సంఘం చైర్మన్ సూరేపల్లి రవికుమార్ మాట్లాడుతూ కవులు సమాజంలో భాగస్వాములని సమాజం కోసం సాహితీ సృజన చేయాలని సూచించారు. మల్లెతీగ సంపాదకుడు కలిమిశ్రీ మాట్లాడారు. సమావేశంలో సీనియర్ జర్నలిస్ట్ ఘంటా విజయకుమార్, భాషా పరిశోధకుడు డాక్టర్ గుమ్మా సాంబశివరావు, సాహితీవేత్తలు సత్యస్వాతి, పంతుల వెంకటేశ్వరరావు, చిత్రకారుడు కళాసాగర్ ప్రసంగించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కవులు స్వీయ కవితా గానం చేశారు. నిర్వాహకులు వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు.

ధర్మకర్తలకు సత్కారం



ధర్మకర్తలను సత్కరిస్తున్న నగరాల సంఘం ప్రతినిధులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పాత శివాలయం, కొత్తగుళ్ల దేవస్థాన ధర్మకర్తలుగా నియమితులైన పలువురిని శ్రీనగరాల సంఘం ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సత్కరించారు. కేఎల్ రావునగర్‌లోని సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సంఘ అధ్యక్షులు ఎన్వీరావు అధ్యక్షతన వహించగా ముఖ్య అతిథులుగా కార్పొరేటర్, సంఘ కోశాధికారి మరుపిళ్ల రాజేష్, న్యాయవాధి పిళ్లా రవి విచ్చేశారు. భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారి ఆలయ ధర్మకర్తలుగా నియమితులైన నాగోతి విజయనిర్మల, నాగోతి గురు, రాంపిళ్ల వాసు, కొత్తగుళ్ల వెంకటేశ్వర స్వామి వారి దేవస్థాన ధర్మకర్త వాండ్రాసి మధులను శాలువాతో సత్కరించారు. ధర్మకర్తలుగా భక్తులకు అవసరమైన సేవలను అందించడమే కాకుండా ఆలయాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. నగరాల కార్పొరేషన్ డైరెక్టర్ శీరం వెంకట్రావు, బాయన శేఖర్‌బాబు, పొట్నూరి శివ, ఎస్ఎస్ఆర్‌లు పాల్గొన్నారు.

అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎమ్మెల్సీ కల్పలతారెడ్డికి వినతి పత్రం అదజేస్తున్న కేఆర్‌జీ శేషుకుమార్

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పని చేస్తున్న అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలంటూ బుధవారం జి.సి.జి.టి.ఏ ఉమ్మడి కృష్ణా జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కే.ఆర్.జి.శేషుకుమార్ ఎమ్మెల్సీ టి.కల్పలతారెడ్డికి వినతి పత్రం అందజేశారు. అధ్యాపకులకు రీడిజిగ్నేషన్‌ను కల్పించాలని, దేశంలోని దాదాపు అన్ని రాష్ట్రాల్లోనూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకులకు అసిస్టెంట్/ అసోసియేట్ ప్రొఫెసర్లుగా 'రీ డిజిగ్నేషన్ ' అమలు చేస్తున్నారని, మన రాష్ట్రంలో కూడా యూజీసీ మార్గదర్శకాల మేరకు అమలు చేయాలని కోరారు. ఈ విషయాన్ని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని కల్పలతారెడ్డి హామీ ఇచ్చారు. డిగ్రీ లెక్చరర్లకు గత 13 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న 'రెక్కనింగ్ ఆఫ్ జూనియర్ లెక్చరర్స్ సర్వీసు సమస్యను పరిష్కరించినందుకుగానూ ఎమ్మెల్సీ కల్పలతారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కొల్లేటి రమేష్ , నాయకులు ముప్పా పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

ఒడిదుడుకులు ఎదుర్కోవడంపై అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న వీరరాఘవయ్య

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఉద్యోగం చేసే మహిళలు జీవితంలో ఎదురయ్యే ఒడిదుడుకులను సమర్థవంతంగా ఎదుర్కోవాలని ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ వీరరాఘవయ్య అన్నారు. నగరంలోని కేవీఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మసీ కళాశాలలో బుధవారం సదస్సు నిర్వహించారు. ముఖ్యవక్తగా పాల్గొన్న వీరరాఘవయ్య మాట్లాడుతూ దేశాభివృద్ధికి, కుటుంబంలో మెరుగైన జీవనానికి మహిళలు తప్పనిసరిగా ఉద్యోగం చేయాలన్నారు. నేడు ఉద్యోగం చేస్తున్న మహిళలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను వివరిస్తూ, వాటిని సమర్థవంతంగా ఎదుర్కోవడానికి అనుసరించాల్సిన విధానాలు వివరించారు. కార్యక్రమంలో ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఆచంట సునీత, కార్య నిర్వాహణాధికారి ఎం.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

యనమలకుదురులో స్కూటీ దగ్ధం

పెనమలూరు: యనమలకుదురులో ఇంటి ఎదుట ఉంచిన బైక్ దగ్ధమవటంతో పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురు సీతారామనగర్ డబ్బా పంపు సెంటర్ వద్ద కర్నాటి లక్ష్మణరావు కుటుంబ సభ్యులతో నివసిస్తున్నాడు. అతను ప్రైవేటు కంపెనీలో మార్కెటింగ్ సేల్స్ మేనేజర్‌గా పని చేస్తున్నాడు. లక్ష్మణరావు 26వ తేదీ అర్ధరాత్రి పని ముగించుకుని వచ్చి తన స్కూటీపై వచ్చి ఇంటి ముందు వాహనం నిలిపి ఉంచాడు. అయితే అర్ధరాత్రి గడిచిన తరువాత పక్కింటి వారు లక్ష్మణరావును లేపి స్కూటీ తగులబడుతోందని చెప్పారు. లక్ష్మణరావు హడావుడిగా వచ్చి వాహనం మంటలు ఆర్పాడు. తన వాహనానికి ఎలా నిప్పు అంటుకుందో తెలియటం లేదని, ఈ ఘటనపై విచారణ చేయాలని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

డోజర్ ట్రాక్టర్ చోరీపై కేసు నమోదు

పెనమలూరు: డోజర్‌తో ఉన్న ట్రాక్టర్ చోరీ ఘటనపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం కంకిపాడు మండలం ఉప్పులూరు గ్రామానికి చెందిన దండుగుల నాగరాజు డోజర్ ట్రాక్టర్‌తో పనులు చేస్తాడు. అతను కొద్ది రోజుల క్రితం పెనమలూరులో ప్లాట్ల వద్ద పనులకు డోజర్ తీసుకు వెళ్లి పనులు చేశాడు. మిగతా పనులు చేయటానికి డోజర్ అక్కడే ఉంచాడు. అతను మరునాడు డోజర్ ఉంచిన ప్రాంతం వద్దకు వెళ్లి చూడగా అక్కడ అది కనబడలేదు. డోజర్ ఆచూకీ కోసం గాలించినా దొరకకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

స్మృతి వనం పనులు పూర్తి చేయాలి

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ బుధవారం ఉదయం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్మృతి వనం నిర్మాణ పనులు పరిశీలించారు. బందర్ రోడ్ వైపు నిర్మాణం అవుతున్న ఫుట్‌పాత్ పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. పనులన్నీ ఈ నెల 31 తేదీ నాటికి పూర్తవ్వాలని, ఫుట్‌పాత్‌కు గ్రానైట్ వేసేందుకు మరింత మంది కార్మికులను పెంచాలని సూచించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విజయవాడ నగరంలో నడిబొడ్డున 19 ఎకరాల విస్తర్ణంలో చేపట్టిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్మృతివనంలో మ్యూజియంలో ప్రదర్శించే ఛాయాచిత్రాలు, కళాఖండాలు అంబేద్కర్ చిన్ననాటి నుంచి నాయకునిగా మారటానికి ఎదురైన అడ్డంకులను ఎలా అధిగమించారో వివరిస్తాయన్నారు. అంబేద్కర్ జీవితంలో ముఖ్యమైన ఘటనలు ప్రదర్శించడానికి పార్కు వద్ద ఆధునిక ఏర్ కండిషన్ థియేటర్, మ్యూజియం , లైబ్రరీ ఉంటుందన్నారు. ఈ పర్యటనలో వీఎంసీ ఎస్ఈ నరసింహమూర్తి, ఈఈ (పార్క్స్) ఏఎస్ఎన్ ప్రసాద్, నరసింహ మూర్తి, ప్రాజెక్ట్ ఇంజినీర్స్ తదితరులు పాల్గొన్నారు.

సివిల్స్ ఇంటర్వ్యూలకు ఎంపికైన వారికి ఉచిత గైడెన్స్

లబ్బీపేట(విజయవాడతూర్పు): యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్‌లో మెయిన్స్‌లో ఉత్తీర్ణులై ఇంటర్వ్యూలకు వెళ్లే అభ్యర్థులకు సీనియర్ ఐఏఎస్ , ఐపీఎస్ అధికారులతో ఉచితంగా మాక్ ఇంటర్వ్యూస్, ఇంటర్వ్యూ గైడెన్స్ ఇవ్వనున్నట్లు శరత్ చంద్ర ఐఏఎస్ అకాడమీ ఎండీ తోట శరత్‌చంద్ర తెలిపారు. ఈ సందర్భంగా ఎంజీరోడ్డులోని తమ సంస్థలో బుధవారం మీడియాతో మాట్లాడారు. ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్ వంటి ఉన్నత సర్వీసులు లక్ష్యాలను నెరవేర్చుకునేలా అభ్యర్థులకు తమ సంస్థలో సీనియర్ అధికారులతో తర్ఫీదు ఇవ్వనున్నట్లు తెలిపారు. అందులో భాగంగా మాజీ చీఫ్ సెక్రటరీ కేవీఎన్ కుమార్, మాజీ అదనపు డీజీపీ జీహెచ్‌పీ రాజు, అడిషనల్ డీజీపీ శంఖబ్రతాలతో పాటు మరికొందరు ఆఫీసర్స్‌లో కలిసి బెంజి సర్కిల్ బ్రాంచ్‌లో ఈ నెల 30 నుంచి ఉచితంగా మాక్ ఇంటర్వ్యూస్, ఇంటర్వ్యూ గైడెన్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడానికి 9494188688 నంబరులో కానీ, శరత్ చంద్ర ఐఏఎస్ అకాడమీ వెబ్‌సైట్‌లో ఉచితంగా లింక్ ద్వారా రిజిస్టర్ చేసుకోవచ్చునని సూచించారు.

బీమా నగదు అందజేత

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం 44వ డివిజన్ పరిధిలోని అగ్గిపెట్టెల కంపెనీ వద్ద కొండ ప్రాంతంలో నివసిస్తున్న గొలగాని శ్రీను (47) మంగళవారం అర్ధరాత్రి గుండెపోటుతో మరణించారు. పెయింటింగ్ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్న ఆయన పేరు వైఎస్సార్ బీమా కింద నమోదై ఉండటంతో శ్రీను అంత్యక్రియల్లో భాగంగా మట్టి ఖర్చుల కింద వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మైలవరపు దుర్గారావు బుధవారం రూ.10వేలు నగదును మృతుడి నామినీ అయిన భార్య కుమారికి అందచేశారు. బీమా కింద రావాల్సిన మిగిలిన మొత్తం త్వరలో నామినీ బ్యాంక్ ఖాతాలో జమ అవుతాయని తెలిపారు. కార్యక్రమంలో 156 సచివాలయం వెల్ఫేర్ సెక్రటరీ రాధాకృష్ణ, ఎడ్మిన్ రాజశేఖర్ పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న ఆత్కూరు పోలీసులు

ఉంగుటూరు: రోడ్డు పక్కన అపస్మారక స్థితిలో పడి ఉన్న ఓ వృద్ధుడిని ఆత్కూరు పోలీసులు ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్సను అందిస్తూ మానవత్వాన్ని చాటుకున్నారు. సేకరించిన వివరాల ప్రకారం పెద అవుటపల్లి–తెంపల్లి రోడ్డులో రైల్వే గేటు సమీపంలో గుర్తు తెలియని ఓ వ్యక్తి రెండు రోజులుగా సంచరిస్తున్నాడు. బుధవారం ఆ వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని అటుగా వెళ్లేవారు చూస్తున్నప్పటికీ ఎవరూ పట్టించుకోలేదు. అయితే ఓ వ్యక్తి ఆత్కూరు పోలీసులకు విషయాన్ని తెలియజేయగా, తక్షణమే స్పందించిన ఆత్కూరు ఎస్ఐ సూర్యశ్రీనివాస్ తన సిబ్బందిని సంఘటనా ప్రదేశానికి పంపించారు. ఆ వ్యక్తి నీరసంగా అపస్మారకస్థితిలో ఉండటాన్ని గమనించిన పోలీసులు 108 అంబులెన్స్‌లో గన్నవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు అతడికి చికిత్స అందిస్తున్నారు. మానవత్వం చూపిన పోలీసులను స్థానికులు అభినందించారు.

29న ముగింపు ఉత్సవం

విజయవాడ కల్చరల్: శృంగేరీ జగద్గురువుల భారతీ తీర్థ మహాస్వామి సన్యాశ్రమ స్వీకార స్వర్ణోత్సవం సందర్భంగా శివరామకృష్ణ క్షేత్రంలో నిర్వహించిన ఉత్సవాలు 29 వతేదీ ముగుస్తాయని ధర్మాధికారి హనుమత్ ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 50 రోజులపాటు శృంగేరీ జగద్గురువల వైభవం అంశంగా ఆధ్యాత్మిక ప్రసంగాలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ఏపీ హైకోర్ట్ జస్టిస్ బి.కృష్ణమోహన్, శృంగేరీ పీఠ ప్రతినిధి తంగిరాల శివకుమార్ పాల్గొంటారని పేర్కొన్నారు. స్వామి వారి భక్తులు పాల్గొనాలని కోరారు.